క్లుప్తంగా

ముగిసిన ఆరాధన మహోత్సవాలు

తెనాలి రూరల్: మండలంలోని కొలవరం గ్రామ క్షత్రియ నగర్‌లో జరుగుతున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 74వ ఆరాధన మహోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా భక్త చింతామణి, శ్రీకృష్ణ రాయబారం, హరిశ్చంద్ర, బ్రహ్మంగారి నాటకాలు ప్రదర్శించారు. ముగింపు సందర్భంగా శుక్రవారం అన్నదానం చేశారు. ఆలయ పూజారి పూసపాటి శ్రీనివాసరావు, వెంకం రాజు, గోపిరాజు, నటరాజు, సిద్ధం రాజు పర్యవేక్షించారు.

రోబోటిక్స్‌పై ఆకట్టుకున్న వర్క్‌షాప్



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేవీకే పబ్లిక్ స్కూల్లో ఆరు నుంచి టెన్త్ విద్యార్థులకు రోబోటిక్స్‌పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్ తెలిపారు. టెస్లా హౌస్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ఆవిష్కరణలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రోబోటిక్స్‌పై అవగాహన వల్ల విద్యార్థులకు సైన్స్, సెన్సార్లు, మోటార్లు, ప్రోగ్రామింగ్‌పై పట్టు సాధించేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. భవిష్యత్‌లో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాముఖ్యత పెరుగుతుందని, తద్వారా విద్యార్థులు ఆయా రంగాల్లో రాణించడం ద్వారా ఉన్నతస్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. విద్యార్థుల్ని భవిష్యత్ శాస్త్రవేత్తలుగా, సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దేందుకు రెండు వారాల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై.రజనీచౌదరి, ఏవో కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్రసాములో పాటిబండ్ల స్కూల్ విద్యార్థిని ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ కర్రసాము (సిలంబం) పోటీల్లో తమ పాఠశాల 7వ తరగతి విద్యార్థిని ఎం. జగ్వీ కృష్ణ కాంస్య పతకాన్ని సాధించినట్లు శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరల్డ్ యూనియన్ సిలంబం ఫెడరేషన్ ఈనెల 17,18,19వ తేదీల్లో నూతక్కిలో నిర్వహించిన ఓపెన్ ఏషియన్ చాంపియన్‌షిప్ సిలంబం పోటీల్లో తమ విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ చూపిందని పేర్కొన్నారు. యుద్ధ విద్య అయిన కర్రసాములో ప్రావీణ్యం సాధించడం గొప్ప విషయమని, ఆడపిల్లలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపే విధంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని జగ్వీకృష్ణతో పాటు కోచ్‌లు బి. కిరణ్‌బాబు, వి. రామకృష్ణను పాటిబండ్ల విష్ణువర్ధన్, పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, పాటిబండ్ల నరేంద్రనాథ్, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి అభినందించారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు



మాట్లాడుతున్న సువీరానందస్వామి

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీమద్భగవద్గీత- ఆత్మ సంయమయోగః ఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారం ముగిశాయి. ఈనెల 20న జరుబుల బంగారుబాబు సౌజన్యంతో ప్రారంభమవ్వగా, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. శ్రీ సువీరానందస్వామి ప్రసంగిస్తూ యోగి శాస్త్రజ్ఞానులు, సకామకర్మలను ఆచరించే వారి కన్న శ్రేష్ఠుడని అన్నారు. భక్తి విశ్వాసాలతో, దృఢమైన అనన్య భావంతో తనయందే స్థిరబుద్ధుడై ఉండమని శ్రీకృష్ణుడు పలికారని తెలిపారు. నిరంతరం తనను భజించేవాడు పరమ శ్రేష్ఠుడని ఆయన బోధించాడన్నారు. అనంతరం శ్రీసువీరానంద స్వామిని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సత్కరించారు.

అప్సా కో-చైర్మన్‌గా రవీంద్రబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘ (అప్సా) రాష్ట్ర కో-చైర్మన్‌గా గుంటూరు నగరంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన సెయింట్ లారెల్స్ స్కూల్ కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు ఎన్నికయ్యారు. విజయవాడలో గురువారం జరిగిన అప్సా రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో తనను రాష్ట్ర కౌన్సిల్ కో-చైర్మన్ పదవికి ఎన్నికైనట్లు ప్రకటించిన రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు నియామక పత్రం అందజేసినట్లు రవీంద్రబాబు శుక్రవారం తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రతినిధులు పి. రాము, చంద్రశేఖర్, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

వైకుంఠవాసా.. గోవిందా!

- చిన్నతిరుపతిగా విలసిల్లుతోన్న 'వైకుంఠపురం'
- నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు
- ఎన్నికల కోడ్‌తో ఆడంబరాలకు స్వస్తి



స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు



వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం

తెనాలి: తెనాలిలోని వైకుంఠపురం దేవస్థానం దేశంలోని పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా, ఇక్కడి ప్రజలకు చిన్న తిరుపతిగా విలసిల్లుతోంది. పట్టణానికి దక్షిణంగా ప్రశాంత వాతావరణంలో ఉందీ ఆలయం. నిత్యకల్యాణం పచ్చతోరణంగా సేవలందుకుంటున్న కలియుగ నాయకుడు శ్రీవేంకటేశ్వరుడు, భక్తాభీష్ట వరదుడై లక్ష్మీపద్మావతి సమేతంగా, పరమ ప్రసన్న శోభను చిందిస్తూ, బహుముఖ వైభవోపేతుడై వెలుగొందుతున్నాడు. వేలాది భక్తులు, దాతల వితరణ, పాలకవర్గాల కృషితో పవిత్ర యాత్రాస్థలంగా శోభిల్లుతోంది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఏటా వైభవోపేతంగా జరుగుతుండే వైకుంఠపురవాసుని బ్రహ్మోత్సవాలు ఎన్నికల కోడ్ కారణంగా సంప్రదాయం ప్రకారం ఆడంబరాలకు పోకుండా నిర్వహించనున్నారు. తొలిరోజు ఉదయం శ్రీస్వామి, అమ్మవార్లకు విశేషార్చన, పూజలతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. 27న నగర సంకీర్తన, 28న సుదర్శన దివ్యానుగ్రహ హోమం, స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తారు. 31న వేద స్వస్తితో ఉత్సవాలు పూర్తవుతాయి. ఉత్సవాల్లో బాగంగా ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సుందరకాండ పారాయణం, కూచిపూడి నృత్యం, గాత్రకచేరీ, అన్నమయ్య సంకీర్తనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

వైకుంఠపురం దేవస్థానం సంస్థాపకుడు తెనాలికి చెందిన తుళ్లూరు బాలనరసింహారావుగౌడ్ పరమ భక్తుడు. పరంధాముడైన శ్రీవేంకటేశ్వరుడు నాగేంద్రుని రూపంలో ఆయన కలలోకి వచ్చి, రేపల్లె రైల్వేవంతెన సమీపంలో వెలిశానని, నాగరాజు రూపాన భక్తులకు స్వాయంగా సాక్షాత్కారమందించి, వారిని నానాముఖ కామితార్థమును అందిస్తానని చెప్పుకొచ్చారు. అక్కడ తనకొక దేవాలయం నిర్మించాలని ఆజ్ఞాపించి, అంతర్ధానమయ్యాడు. తాను కొలిచే స్వామి ఆజ్ఞాపించాక, కాదేముంది? బాలనరసింహారావు గౌడ్ స్వప్నం సత్యమైంది. సంకల్పం సర్వతోముఖమైంది. 1961లో ఇక్కడ స్థలం అభివృద్ధి చేసి భక్తుల సహకారంతో 1972లో ఆగమ శాస్త్రానుసారంగా, బహుముఖ శిల్ప చిత్రాచిత్రంగా రమణీయమైన దేవాలయ నిర్మాణం పూర్తిచేసి, విగ్రహ ప్రతిష్ఠ చేశారు.

భక్తుల ఆదరణతో ఆ మరుసటి ఏడాది అంటే 1973లో ఆలయం దేవదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. ఏటికేడాది భక్తుల సంఖ్య పెరుగుతూ కోరిన కోర్కెలు తీరుస్తున్న ఇలవేలుపుగా, భక్తుల కొంగుబంగారంగా శ్రీవేంకటేశ్వరుడు ఇక్కడ పూజలు అందుకుంటున్నాడు. భక్తుల సంఖ్య, ఆలయ ఆదాయం ఏటేటా వర్ధిల్లింది. ఆలయ కార్యనిర్వహణాధికారి నుంచి 1999లో సహాయ కమిషనరు హోదా లభించింది. నిత్యపూజలతో పాటు ప్రతి శుక్ర, శని వారాల్లో ప్రత్యేక పూజలు జరిగే ఆలయంలో ఏటా వైశాఖ మాసం నుంచి బహుళ పాడ్యమి వరకు బ్రహ్మోత్సవాలను కమనీయంగా నిర్వహిస్తున్నారు. పుష్యమాసంలో వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వారదర్శనం, సంక్రాంతికి తెప్పోత్సవం వైభవంగా చేస్తున్నారు. తిరుమల తరహాలో పుష్పయాగం, పవిత్రోత్సవాలను 15 ఏళ్ల క్రితమే ప్రారంభించారు. నిత్యాన్నదాన పథకం ఇక్కడ అమలవుతోంది. ఆలయం 4.36 ఎకరాల్లో ఉండగా, ఇందులో 1.60 ఎకరాల్లో ప్రధాన ఆలయం, షాపింగ్ కాంప్లెక్స్, కార్యాలయం ఉన్నాయి. మిగిలిన 2.70 ఎకరాల్లో భక్తుల కోసం శ్రీనివాస సదన్, పద్మావతి సదనం, శ్రీనివాస కల్యాణ మండపం, పూర్ణ కళాక్షేత్ర మండపం, పద్మావతి కళ్యాణ మండపం నిర్మించారు. ఇందులో ఒక కల్యాణ మండపంలో భక్తులకు ఉచితంగానే వసతిని కల్పిస్తున్నారు. వరాహస్వామి ఆలయం, సర్వాభీష్ట నాగేదంద్ర స్వామి, గరుత్మంతుడు, నృత్య గణపతి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆలయంలో విధుల నిర్వహణకు సిబ్బంది, అర్చకులు కలిపి 30 మందికి పైగా ఉన్నారు. శ్రీ వేంకటేశ్వరుడి ఆదాయం పూజా టికెట్లు, హుండీ, షాపింగ్ కాంప్లెక్సులు, కేశఖండనశాల వేలం హక్కులు, దాతల విరాళాలే ప్రధానం. ఏటా రూ.కోటి పైగానే సమకూరుతున్నాయి. 2009-10లో రికార్డుస్థాయిలో రూ.1.76 కోట్ల వరకు వచ్చాయి. స్వామి వారికి సుమారు 4.5 కిలోల బంగారం, 138 కిలోల వెండి ఆభరణాలున్నాయి. నిధులు రూ.60.75 లక్షలు, అన్నదాన నిధి కింద మరో రూ.48.57 లక్షలు ఉన్నాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో హనుమాన్ సేవకుడు వుప్పల వరదరాజులు అధ్యక్షతన ఏర్పాటైన ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో భక్తులను విశేషంగా ఆకర్షించారు. ఆలయ చరిత్రలో తొలిసారిగా రథసప్తమికి తిరుమల తరహాలో సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు సప్త వాహన సేవలు, గ్రామోత్సవాన్ని ఆరంభించారు. సంగీత మండపాన్ని నిర్మించారు. బ్రహ్మోత్సవాల తర్వాత స్వామివారి శ్రీచక్ర స్నానానికి వీలుగా కోనేరు నిర్మించారు. భక్తుల సంఖ్య పెరగడంతో హుండీ ఆదాయం రెట్టింపు అయ్యింది.

సంప్రదాయబద్ధంగా బ్రహ్మోత్సవాలు



ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అట్టహాసాలకు పోకుండా సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నాం. శ్రీస్వామి, అమ్మవార్లకు విశేషార్చలనతోపాటు వార్షికంగా జరిగే సేవలు కొనసాగుతాయి.

– కుంభా సాయిబాబు గౌడ్, ఛైర్మన్, ధర్మకర్తల మండలి

మూడు ఇసుక లారీలు, జేసీబీ మిషన్ సీజ్




మున్నంగి (కొల్లిపర): మండల పరిధిలో మున్నంగి గ్రామంలో ఎటు వంటి రసీదులు లేకుండా అక్రమంగా ఇసుకను మూడు లారీలలో శుక్రవారం తరలిస్తుండగా గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్‌ఐ ఆర్.రవీంద్రారెడ్డి ఇసుక లారీలను పరిశీలించి ఎటువంటి వే బిల్లు లేక పోవటంతో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మున్నంగి గ్రామంలో ఇసుక మాఫీయా వ్యక్తులు ఖాళీ స్థలంలో నిల్వ ఉంచిన ఇసుకను గుట్టు చప్పుడు కాకుండా లారీలు ద్వారా ఇసుక తరలిస్తున్నారు అనే సమాచారం రావటంతో వెంటనే సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా మూడు లారీలు, ద్వారా తరలిస్తున్న ఇసుకను, లోడింగ్ పాయింట్ వద్ద ఉన్న జేసీబీ మిషన్ పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుక, మట్టి తరలించే సమయంలో ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని వే బిల్లు ద్వారా మాత్రమే తరలించాలని లేని పక్షంలో అటు వంటి వాహనం పై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

26న టెన్నిస్ వాలీబాల్ అసోసియేషన్ సమావేశం

బాపట్ల: జిల్లా టెన్నిస్ వాలీబాల్ అసోసియేషన్ సమావేశం ఈ నెల 26న బాపట్లలో జరుగుతుందని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె.వరప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎస్‌ఏడబ్ల్యూఎంబీ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ సమావేశం జరుగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

రేపు చెన్నైలో 'ఏడో రుతువు' పుస్తకావిష్కరణ



ఏడో రుతువు కవితా సంపుటి

తెనాలి: విశ్వర్షి వాసిలిగా ప్రసిద్ధికెక్కిన వాసిలి వసంతకుమార్ తాజా రచన 'ఏడో రుతువు' కవితా సంపుటి ఈనెల 26న చెన్నైలో ఆవిష్కరణ జరగనుంది. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక 'తరతరాల తెలుగు కవిత' పేరుతో నెలనెలా నిర్వహిస్తున్న ఉపన్యాస ధారావాహిక కార్యక్రమాన్ని ఆరోజు సాయంత్రం అక్కడి ఆంధ్రా క్లబ్‌లోని కృష్ణాహాలులో ఏర్పాటు చేశారు. ఇందులో తొలి తెలుగు యౌగిక కావ్యం నేనుః వైవిధ్యత, వినూత్నత అంశంపై విశ్వర్షి వాసిలి ప్రసంగిస్తారు. ఆయన రాసిన కవితల సంపుటి 'ఏడో రుతువు' పుస్తకాన్ని ఇదే వేదికపై ఆవిష్కరిస్తారు. వేద విజ్ఞానవేదిక అధ్యక్ష, కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు పర్యవేక్షిస్తారు. సనాతన ధర్మ మూలాలకు సామాజిక స్పృహను జోడించి వ్యక్తిత్వ వికాస విజ్ఞానాన్ని సరళంగా అందిస్తున్న విశ్వర్షి వాసిలి నిజానికి మాస్టర్ యోగ గురువు. సొంతూరు తెనాలి సమీపంలోని కోపల్లె. ఆంగ్లోపన్యాసకుడిగా, మాస్టర్ యోగ గురువుగా, బహుగ్రంథకర్తగా తెలుగువారికి సుపరిచితులైన శతాధిక గ్రంథకర్త 'మాస్టర్' శార్వరి కుమారుడు. సికింద్రాబాద్‌లో తండ్రి స్థాపించిన 'యోగాలయ' రీసెర్చ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఆర్కివ్స్ సెంటర్, మీడియా వెల్ఫేర్ సెంటర్, కౌన్సెలింగ్ సెంటర్‌నూ నడుపుతున్నారు. వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక మనో విశ్లేషణలకు పుస్తక రచనల వాకిళ్లను తెరిచి, తన అసంఖ్యాక రచనలతో తెలుగులో ప్రత్యేకస్థానం దక్కించుకున్నారు. గీత నుంచి మొదలుపెట్టి, అనేక ప్రాక్పశ్చిమ తాత్విక అంశాలపై ఆయన రాసిన పుస్తకాలు ప్రజాదరణను పొందాయి. 'వాసిలి వాకిలి' కాలమ్ పాఠకుల విశేష అభిమానాన్ని అందుకుంది. ఆ కలం నుంచి వెలువడిన 'నేను', తెలుగులో తొలి యౌగిక కావ్యం. ఆధ్యాత్మిక దృష్టి కోణానికి ఆధునికతను మేళవించిన 'నేను' విశ్వావలోకనం తెలుగు సాహిత్య చరిత్రలో నవీన ప్రయోగంగా మేధావుల ప్రశంసలందుకుంది.

ట్రాక్టర్ బోల్తా.. పలువురికి గాయాలు





ప్రమాదంలో క్షతగాత్రులు

రేపల్లె మండలం కామరాజుగడ్డ వద్ద ఘటన

రేపల్లెరూరల్: ట్రాక్టర్ బోల్తాపడి 20 మందికి పైగా గాయాలైన సంఘటన మండలంలోని కామరాజుగడ్డ గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నగరం మండలం దూళిపూడి పంచాయతీ పరిధిలోని ఉయ్యూరువారిపాలెం గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ గ్రామ దేవత గుడారంకమ్మ అమ్మవారి కొలుపులలో భాగంగా రెండు ట్రాక్టర్లలో రేపల్లె మండలం మోర్తోట కృష్ణానదికి వచ్చారు. ఇదే ఉత్సవాలలో పాల్గొనేందుకు కొల్లిపర్ర మండలం దావులూరువారిపాలెంకు చెందిన 30 మంది మరో ట్రాక్టర్‌లో వచ్చారు. వీరంతా కృష్ణానదిలో పుణ్యస్నాన మాచరించి కొలుపులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో ఉయ్యూరువారిపాలెంకు చెందిన రెండు ట్రాక్టర్‌లు వెళ్ళిపోయాయి. దావులూరివారిపాలెంకు చెందిన వారు తమ గ్రామానికి ట్రాక్టర్‌పై వెళ్తుండగా కామజుగడ్డ వద్ద మలుపు తిరిగే సమయంలో ట్రాక్టర్ ఒక్కసారిగా రహదారిపై బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ఉన్న 30 మందిలో 20 మంది వరకు గాయాలపాలయ్యారు. దీంతో స్థానికులు 108కి సమాచారం అందించగా వాహనంలో కొంత మందిని, ప్రైవేటు వాహనాలలో మరికొంత మందిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో తీవ్రంగా గాయాలపాలైన ఉయ్యూరు వెంకటేశ్వరమ్మ, ఉయ్యూరు వీరవెంకట రత్నం, గోపీకృష్ణ, శ్రీహరి, సావిత్రి, వెంకటేశ్వరరావు, భవానీ, సాంబశివరావు, వెంకటలక్ష్మి, మహాలక్ష్మి, వెంకటేశ్వరమ్మలను ప్రథమ చికిత్సలు నిర్వహించి మెరుగైన చికిత్సకు తెనాలి వైద్యశాలకు తరలించారు. స్వల్ప గాయాలైన మిగిలిన వారికి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలోనే చికిత్స అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



పట్నంబజారు: మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారానికి చెందిన కొనగళ్ల మురళీకృష్ణ (54) అదే ప్రాంతంలో కాళీయ మర్దన దేవాలయాన్ని 2011లో నిర్మించారు. అప్పటి నుంచి ఆలయ బాధ్యతలు ఆయనే చూసుకుంటుండేవారు. ఆలయానికి సంబంధించిన రశీదు పుస్తకాలు కనపడకపోవడంతో మనస్తాపానికి గురైన మురళీకృష్ణ గురువారం రాత్రి కోనేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం మృతదేహం పైకి తేలడంతో గుర్తించిన పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ పి.దేవప్రభాకర్, ఎస్‌ఐ సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోగ్రాఫర్ చుక్కా శ్రీనివాసబాబు మృతి



చుక్కా శ్రీనివాసబాబు

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్, బసవమందిరం ఆలయం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చుక్కా శ్రీనివాసబాబు (58) శుక్రవారం ఉదయం మారీసుపేట సీబీఎన్ కాలనీలోని తన స్వగృహంలో మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య ఉన్నారు. సంతానం లేరు. తన తండ్రి భాను స్టూడియో నిర్వాహకుడైన బసవకోటయ్య వద్ద ఫొటోగ్రఫీ నేర్చుకుని అదే వృత్తిలో స్థిరపడ్డారు. గత 25 ఏళ్లుగా వివిధ కార్యక్రమాల ఫొటోలను పత్రికలకు పంపిస్తూ ప్రెస్ ఫొటోగ్రాఫర్‌గా గుర్తింపును పొందారు. శివభక్తుడైన శ్రీనివాసబాబు శైవాలయాల ఉత్సవాల్లో శివతాండవం నృత్యంలో ప్రత్యేకతను సాధించాడు. ముఖ్యంగా వీరభద్రపళ్లం ఉత్సవంలో పెద్ద ఖడ్గాలు తీసుకుని శ్రీనివాసబాబు తన నృత్యంతో అందరినీ ఆకర్షించేవాడు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో స్థానిక నందులపేటలోని బసవమందిరం ఆలయానికి ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్‌గా రెండు పర్యాయాలు సేవలందించారు. పట్టణానికి చెందిన వివిధ రంగాల ప్రముఖులు, పాత్రికేయులు, ఫొటో, వీడియోగ్రాఫర్లు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం పాండురంగపేటలోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తిచేశారు.

స్కిజోఫ్రీనియాపై అశ్రద్ధ వద్దు



గుంటూరు మెడికల్: ప్రపంచ స్కిజోఫ్రీనియా అవగాహనా దినోత్సవం సందర్భంగా గుంటూరు జీజీహెచ్‌లోని మానసిక వైద్య విభాగంలో శుక్రవారం ఇంటర్నల్, పీజీ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ హారిక మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఒత్తిడివల్ల పలువురు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డాక్టర్ దయానిధి మాట్లాడుతూ మానసిక సమస్యల్ని వెంటనే గుర్తించి చికిత్స అందిస్తే రోగి త్వరగా కోలుకుంటారని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమా జ్యోతి, సహ ఆచార్యులు డాక్టర్ వెంకట కిరణ్, డాక్టర్ సాయి కిరణ్, నిమీష, సాయికృష్ణ పాల్గొన్నారు.

ప్రారంభమైన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



జెఎంజె కళాశాలలో ఇంటర్ విద్యార్థిని హాల్‌టిక్కెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది.



ఎన్‌సీఆర్ స్కూల్‌లో రూమ్ నెంబర్లను చూసుకుంటున్న టెన్త్ విద్యార్థులు



టెన్త్ విద్యార్థుల హాల్‌టికెట్ పరిశీలిస్తున్న మహిళ పోలీసు

తెనాలిఅర్బన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తెనాలిలోని వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల, జెఎంజె మహిళా కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాలలో పరీక్షలు జరిగాయి. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమై 12 గంటలకు ముగిసింది. మొదటి రోజు లాంగ్వేజ్ పరీక్ష జరిగింది. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వచ్చారు. వారి హాల్ టికెట్‌లను సిబ్బంది పరిశీలించి లోపలకి అనుమతించారు. అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలు జరిగాయి. సుమారు రెండు వేల మంది వరకు విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

పదోవ తరగతి పరీక్షలు కూడా...

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తెనాలి పట్టణంలోని ఎన్‌సీఆర్‌ఎస్‌ఎంహెచ్ స్కూల్, టీఎస్‌ఆర్‌ఎంహెచ్ స్కూల్, మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లను అధికారులు పరీక్ష కేంద్రాలుగా నిర్ణయించారు. ఉదయం 9.30 నుంచి 12.45 వరకు పరీక్ష జరిగింది. మొదటి రోజు తెలుగు పరీక్ష జరిగింది. ఉదయం 9 గంటల నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వచ్చారు. వారి హాల్ టిక్కెట్లను సిబ్బంది పరిశీలించి అనుమతించారు. ఒక్కొక్క కేంద్రంలో 280 మంది చొప్పున 1120 మంది పరీక్షకు హాజరయ్యారు. జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 2001-2002లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. వివిధ కొలువుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. తరగతి గదుల్లో చేసిన అల్లర్లను నెమరు వేసుకుని పరవశం చెందారు. చదువుకున్న రోజులు, ఆపాత మధురాలను గుర్తు చేసుకుని విద్యార్థులుగా మారిపోయారు. వివిధ హోదాల్లో స్థిరపడిన వీరంతా చిన్ననాటి మిత్రుల ఆత్మీయ పలకరింపుతో పులకించిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నేహితులతో గడిపి అక్కడి నుంచి వెళ్ల లేక బరువెక్కిన హృదయాలతో తమ ఊర్లకు పయనమయ్యారు. నాడు చదువు చెప్పిన గురువులు, ప్రస్తుత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

తిరుమలకు కాలినడకన ప్రయాణం



భట్టిప్రోలు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ విజయం సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని, వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామం నుంచి పార్టీ నాయకులు, అభిమానులు శుక్రవారం తిరుమలకు కాలినడకన బయలు దేరారు. సూరేపల్లికి చెందిన పేటేటి దుర్గ ఆధ్వర్యంలో కోనేటిపురంకు చెందిన కర్రా తిరుపతయ్య, చింతమోటుకు చెందిన శొంటి సాయిలు ఈ కాలినడకలో పాల్గొన్నారు. తొలుత సూరేపల్లి గ్రామ దేవత శ్రీ పుట్లమ్మ తల్లికి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోజుకు 60 కిలోమీటర్ల చొప్పున నడుస్తూ బుధవారం నాటికి స్వామి వారి సన్నిధి తిరుమలకు చేరుకోనున్నట్లు కిరణ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు పీజీ అరుణ్‌శాస్త్రి, మోర్ల కోటేశ్వరరావు, వాకా అంకబాబు, కట్టుపల్లి కిషోర్, బొల్లెద్దు శ్రీకాంత్‌లు సంఘీ భావంగా కొంత దూరం వారితో పాటు నడిచారు.